క్లుప్తంగా

ఆరోగ్య సురక్ష సర్వే త్వరగా పూర్తి చేయండి



ముత్తలూరులో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మధుసూదనరెడ్డి

రుద్రవరం: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ మధుసూదనరెడ్డి వలంటీర్లను ఆదేశించారు. మండల పరిధిలోని నర్సాపురం, ముత్త లూరు గ్రామాల్లో సాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. సర్వే తీరు ను, ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకు న్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించ బోయే వైద్య శిబిరాల్లో వారందరికీ తగిన వైద్యం అందేలా సర్వేను సక్రమంగా త్వరిత గతిన, పూర్తి చేయాలని వలంటీర్లకు చెప్పారు. అలాగే ఆయా గ్రామాల్లోని సచివాలయాలను తనిఖీ చేశారు.

హిందీ భాషను సంరక్షించుకుందాం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జాతీయ భాష హిందీని సంరక్షించుకుందామని హిందీ వికాస కేంద్రం, ఎస్పీ టుటోరియల్ కోచింగ్ సెంటర్ అధ్యక్షుడు బాబు, సయ్యద్‌బాషా పిలుపునిచ్చారు. శనివారం వికాస కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు హిందీభాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్నటువంటి ప్రతిభను వెలికి తీసేందుకే ఇలాంటి వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఎస్పీ రసూల్, సయ్యద్‌బాషా విజేతలకు బహుమతులు అందజేశారు.

పాఠశాలకు వాటర్‌ప్లాంట్ విరాళం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మాబున్నిసా

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలలో చైతన్య కళాభారతి ఆధ్వర్యంలో ఆశా చారిటీ యూకే ఆర్థిక సాయంతో వాటర్‌ప్లాంట్‌ను విరాళంగా అందజేసినట్లు కౌన్సిలర్ సావిత్రమ్మ, వార్డు ఇన్‌చార్జ్ రమణ, చైతన్య కళాభారతి అధ్యక్షుడు విజయభాస్కర్ తెలిపారు. శనివారం వాటర్ ప్లాంట్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, కోఆప్షన్ సభ్యుడు సలాముల్లా ప్రారంభించారు.

స్మార్ట్ మీటర్లు బిగించడం నిలిపివేయాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం నిలిపివేయాలని సీపీఎం కార్యదర్శి పుల్లా నరసింహులు, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వామపక్ష పార్టీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీలకు, వృత్తిదారులు ఎక్కడ నివసిస్తున్నా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 27న కలెక్టర్ కార్యాలయం ఎదుట వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాగరాజు, రఫి, బాబాఫకృద్దీన్, తోట మద్దులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన శ్రీ లక్ష్మీ నరసింహ కంబగిరి స్వామి, అభయాంజనేయ స్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమార్చన, అభిషేకాలు, ఆకుపూజ నిర్వహించారు. అనంతరం అర్చకులు కమలేష్ శర్మ, లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, అనంతయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

నంద్యాల(అర్బన్): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విషయంపై ఉద్యమిద్దామని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. వాల్మీకుల పునరుద్ధరణ బిల్లు ఆలస్యం కావడంపై శనివారం స్థానిక బస్టాండ్ సమీపంలోని వాల్మీకి విగ్రహం వద్ద నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 67ఏళ్లుగా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామంటూ ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వాల్మీకులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పరమేష్, బాలు, ఈశ్వరయ్య, రాజు, నాగేంద్ర, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాలకు చెక్

- కొండాపురం, గుండుపాపల గ్రామాల్లో 'జగనన్న శాశ్వత భూహక్కు- భూ రక్ష'
- 949 మందికి భూహక్కు పత్రాల పంపిణీ



కొండాపురంలో రైతుకు భూహక్కుపత్రాలను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

దొర్నిపాడు: జగనన్న శాశ్వత భూహక్కు- భూ రక్ష పథకం ద్వారా ఎన్నో ఏళ్లనాటి భూవివాదాల సమస్యలకు ప్రభుత్వం చెక్ పెట్టింది. మండలంలోని కొండాపురం, గుండుపాపల గ్రామాల్లో మొదటి విడతలో భాగంగా సర్వే పూర్తి కాగా శనివారం రైతులకు శశ్వత భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎంపీపీ అమర్‌నాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో సర్పంచులు పయిడేల మాధవీలత, వెంకటేశ్వర్లు అధ్యక్షతన 949 మంది రైతులకు శశ్వత భూహక్కు పత్రాలను అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో ఎళ్లుగా భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు శాశ్వత పరిష్కారం చూపిందన్నారు. మీ భూమి–మా హామీ అంటూ ఉచితంగా కొలతలు వేసి హద్దుల వద్ద రాళ్లుపాతారని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా హక్కు పత్రాలను తయారు చేశారన్నారు. గతంలో ఎఫ్ఎంబీలకు ఇబ్బందులు పడేవారని ప్రస్తుతం హక్కుపత్రంలో ప్రతి సర్వేనంబర్‌కు సంబంధించి ఎంఫ్‌బీలను రూపొందించారని తెలిపారు. భవిష్యత్‌లో జరిగే లావాదేవీలకు సురక్షితం చేయడానికి ల్యాండ్ టైటిల్, ఆస్తి యజమాని పేరు, ల్యాండ్ పార్శిల్ నంబర్, క్యూఆర్ కోడ్ వంటి భద్రతా ప్రమాణాలతో పత్రాలను ప్రింట్ చేశారని తహసీల్దార్ జయప్రసాద్ వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శకుంతల, సొసైటీ అధ్యక్షుడు భూమా చెంచిరెడ్డి, డీలర్ శివుడు, బాలవెంకటరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ శివారెడ్డి, మోహన్‌నాయుడు, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, ఉప సర్పంచి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు పత్రాలు పకడ్బందీగా ఉన్నాయి



మాకు అందజేసిన భూహక్కు పత్రాలను పకడ్బందీగా ఉన్నాయి. మా ఫొటో, ఆధార్ నంబర్, క్యూఆర్ కోడ్, పొలం కొలతలకు సంబంధించిన మ్యాప్‌లు అన్నీ ఉన్నాయి. ఏదైనా సమస్య వచ్చిందంటే వెంటనే కొలతలు వేసుకోవచ్చు.

–రామలక్ష్మమ్మ, కొండాపురం

రైతులకు గట్టి భద్రత



జగనన్న శాశ్వత భూహక్కు- భూ రక్ష పథకం ద్వారా మాకు అందజేసిన భూహక్కు పత్రాలు రైతులకు భవిష్యత్‌లో భద్రతగా ఉంటాయి. ఎన్నీ సర్వే నంబర్లు ఉంటే వాటికి డిజిటల్ మ్యాప్‌లను ఇచ్చారు. క్యూఆర్ కోడ్ ఆధారిత పత్రాలు బాగున్నాయి. ఎదైనా లావాదేవీలు జరగడానికి సులభంగా ఉంటుంది.

–రాముడు, గుండుపాపల

సబ్సిడీపై జొన్న విత్తనాలు

శిరివెళ్ల: రైతులకు 80 శాతం సబ్సిడీపై జొన్న విత్తనాలు అందజేస్తున్నామని ఏఓ సుధాకర్ శనివారం తెలిపారు. వర్షాభావ పరిస్థితులలో మండలానికి 45 క్వింటాళ్ల విత్తనాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. 3 కేజీల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, కేజీ విత్తనం ధర రూ. 220, సబ్సిడీ పోను రైతు రూ. 44 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

నంద్యాల(న్యూటౌన్): డీఎస్సీ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, శివ కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. యువకులు ఉన్నత చదువులు చదివి, చాలీచాలని జీతాలతో పని చేసుకుంటూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రూప్–1, 2, 3, 4లకు సంబంధించి ప్రభుత్వ ఉద్యోగాలు 40వేలకు పైగా ఖాళీగా ఉన్నాయని, వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగాలు కల్పించాలన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

చురుగ్గా భూ రీసర్వే



కోటపాడులో పొలాలు సర్వే చేస్తున్న సిబ్బంది

శిరివెళ్ల: మండలంలో జగనన్న భూ రక్ష- భూ హక్కు కింద భూ సమగ్ర రీసర్వే చురుకుగా జరుగుతోంది. మండలంలో ఇప్పటికే గోవిందపల్లె, గంగవరంలలో సర్వే పూర్తియింది. తాజా గా కోటపాడు, వనికినిదిన్నెలో రీ సర్వే జరుగుతోంది. కోటపాడులో 1,947 ఎకరాలు భూమి ఉంది.అందులో 69 ఎకరాలు ప్రభుత్వ భూమి, 136.46 ఎకరాలు దేవస్థానాల భూమి. 1,157 మంది రైతులు ఉన్నారు. సర్వే సిబ్బంది ప్రతి రైతుకు చెందిన భూమి వద్ద అతని సమక్షంలో రికార్డుల అధారంగా సర్వే చేస్తున్నారు. అలాగే వనికినిదిన్నెలో 1,283 ఎకరాలు భూమి ఉంది. 50 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. 110 మంది రైతులు ఉన్నారు. అక్కడ కూడా రీ సర్వే జరుగుతోంది. ఈ నెల 30లోగా ఫీల్డ్ లెవెల్‌లో సర్వే పూర్తి చేయాల్సి ఉంది. తర్వాత రికార్డులో ఉన్న భూమి, క్షేత్ర స్థాయిలో ఉన్న భూమి వ్యత్యాసంపై విచారణ చేస్తారు.

వాసాపురం వేంకటేశ్వరుడికి విశేష పూజలు



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె పంచాయతీ వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ, గోదా సమేత వాసాపురం వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మధుసూధనరెడ్డి, రంగనాయకులు, నరసింహ్ములు ఆధ్వర్యంలో అర్చకులు ఉదయాన్నే స్వామి అమ్మ వార్లకు నిత్య పూజలు గావించారు. అనంతరం అభిషేకించి పట్టు వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

ఆలయ నిర్మాణానికి రూ.1,00,116 విరాళం

వాసాపురం వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో దాదాపు 850 ఏళ్ల క్రితం కొలువైన పాత వేంకటేశ్వర స్వామి గుడి నిర్మాణానికై మండల కేంద్రమైన రుద్రవరానికి చెందిన గంధం నాగిరెడ్డి, వీరమ్మ దంపతులు శనివారం రూ.1,00,116 నగదును విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ నిర్వాహకులు దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు.

పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకుందాం

నంద్యాల (సిటీ): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక లలితానగర్ పార్కులో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నేటి నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. పట్టణంలోని రైల్వే స్టేషన్, పార్కులు, ఆలయాలు, బస్‌స్టాండ్‌లతో పాటు ప్రభుత్వ కార్యాలయాల వద్ద పరిసరాలను పరిశుభ్రం చేసేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. అనంతరం పార్కును అధికారులు విద్యార్థులతో కలిసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, ఎంహెచ్‌ఓ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

831 పనులకు రూ.30 కోట్లు మంజూరు

గోస్పాడు: నంద్యాల జిల్లా పరిధిలో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 831 పనులు చేపట్టేందుకు రూ.30 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని జిల్లా ఇంజినీరింగ్ అధికారి రామ్మోహన్ తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తోన్న గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు ఆయా గ్రామాల్లో పూర్తి చేయడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, వెంటనే పనులు చేపట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. అందులో భాగంగా 831 పనులు మంజూరు కాగా ఇప్పటికే 242 పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులు కూడా ఆయా దశల్లో కొనసాగుతున్నాయని అన్నారు.

పకడ్బందీగా సర్వే

ఉయ్యాలవాడ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టనున్న పంచాయతీరాజ్ మొబైల్ యాప్ సర్వేను మండలంలో పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. సర్వేకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు వెల్లడించారు. సచివాలయ ఉద్యోగులు గ్రామంలో గృహాల వద్దకు వచ్చినప్పుడు గృహ యజమానులు పూర్తి వివరాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రమేష్ చంద్రబాలాజీ, లింగమ్మ, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

చాగలమర్రి: మండల కేంద్రంలోని 12వ వార్డులో నివాసం ఉన్న షేక్ ఆహమ్మద్ (48) అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద గ్రామ సర్పంచ్ తోలసమ్మ రూ.10 వేలను మృతుడి భార్య షేక్.రజీయాకు శనివారం అందజేశారు. మిగతా మొత్తాన్ని ఆమె బ్యాంకు ఖాతాలో త్వరలోనే ప్రభుత్వం జమ చేస్తుంద న్నారు. వార్డు సభ్యురాలు గౌస్‌బీ, వెల్ఫేర్ అసిస్టెంట్ నగవేణి, వలంటీర్లు షబానా, సిద్ధిఖ్ ఉన్నారు.

రాష్ట్ర ముస్లిం రచయితల సంఘం ఉపాధ్యక్షుడిగా సమద్

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్ర రాష్ట్ర ముస్లిం రచయితల (మురసం) ఉపాధ్యక్షుడిగా నంద్యాల కవి రచయిత షేక్ అబ్దుల్‌సమద్ ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ గుంటూరులో ఇస్లామియా కార్యాలయంలో జరిగిన సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. మతసామరస్యం సామాజిక సాహిత్య చైతన్యం, తెలుగుభాషాభివృద్ధి వంటి లక్ష్యాలతో మురసం పని చేస్తుందన్నారు. అక్టోబర్‌లో నంద్యాలలో రాష్ట్ర స్థాయి ముస్లిం రచయిత సంఘం సమావేశం కానుందన్నారు.

స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తి చేయండి

- పెండింగ్‌లో ఉన్న భూ హక్కు పత్రాలు వెంటనే పంపిణీ చేయండి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

నంద్యాల: సర్వే పూర్తయిన గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను సోమవారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డిలు తహసీల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో భూసేకరణ, పీఓఎల్ఆర్ రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్, భూ హక్కు పత్రాల పంపిణీ తదితర రెవెన్యూ అంశాలపై తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ హక్కు పత్రాల పంపిణీకి సంబంధించి సీసీఎల్ఏ ప్రత్యేక దృష్టి సారించిందని, ఈ నేపథ్యంలో పెండింగులో ఉన్న 50 గ్రామాల్లో సోమవారం లోగా భూహక్కు పత్రాలు పంపిణీ చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 167కే జాతీయ రహదారికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న 10 గ్రామాల అవార్డ్‌ను పాస్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత మండలాల తహసీల్దార్లను ఆదేశించారు. వెలుగోడులో 2 గ్రామాలు, నంద్యాలలో 4, బండి ఆత్మకూరులో 2, ఆత్మకూరులో 2 గ్రామాలలో పెండింగ్లో ఉన్నాయని చెప్పారు. సమావేశంలో డీఆర్ఓ పుల్లయ్య, సంబంధిత డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

కాపర్ ఆక్సిక్లోరైడ్‌తో నారుకుళ్లు నివారణ




మిరప మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా అధికారి నాగరాజు

నంద్యాల(అర్బన్): కాపర్ ఆక్సి క్లోరైడ్ పిచికారీతో మిరపలో నారుకుళ్లను రైతులు నివారించుకోవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు తెలిపారు. ఎకరాకు 500 గ్రాములు కాపర్ ఆక్సి క్లోరైడ్‌ను 200 లీటర్ల నీటితో కలిపి ట్యాంకుల ద్వారా పిచికారీ చేయాలని సూచించారు. మండలంలోని మిట్నాల గ్రామంలో రైతులు సాగు చేసిన మిరప పంటను మండల ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్‌తో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 17–0–45 రకం మందులతో పంటను బెట్ట నుంచి సంరక్షించుకోవచ్చన్నారు. వాణిజ్య పంటలైన మిరప, పసుపు, కూరగాయ పంటలు, పూల మొక్కలను సాగు చేసిన రైతులు తప్పని సరిగా ఈ క్రాప్‌ను నమోదు చేయించుకోవాలన్నారు.

పథకాల అమలులో కేంద్రం విఫలం

నంద్యాల(అర్బన్): దళిత, గిరిజనులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కేవీపీఎస్ జిల్లా కోశాధికారి ఏసేబు ఆరోపించారు. శనివారం స్థానిక కార్యాలయంలో దళిత గిరిజనులకు న్యాయం చేయాలంటూ విజయవాడలో 29న నిర్వహించే మహాధర్నా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ దళిత గిరిజనులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలంటూ ఈనెల 25, 26 తేదీల్లో నంద్యాల జిల్లా వ్యాప్తంగా దళిత రక్షణ యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బంగారం, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనంలో అపశృతి



వాగు వెంట గాలిస్తున్న పోలీసులు

ఆళ్లగడ్డ : గణేష్ నిమజ్జనం సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు వక్కిలేరువాగులో పడి యువకుడు గల్లంతైన సంఘటన ఆళ్లగడ్డ పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ రమేష్‌బాబు, తహసీల్దార్ హరినాథరావు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని సీతారంనగర్‌కు చెందిన భూమా నరసింహారెడ్డి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి (30) స్థానిక శిల్ప మందిరంలో శిల్పిగా పనిచేస్తున్నాడు. వినాయక ఉత్సవాల సందర్భంగా తమ వీధిలో ఏర్పాటు చేసిన ప్రతిమను నిమజ్జనం చేసేందుకు వక్కిలేరు వాగు దగ్గరకు వచ్చాడు. వినాయక ప్రతిమను క్రేన్‌లో నుంచి వదులుతున్న సమయంలో ప్రమాద వశాత్తు చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు యువకులు జారి వాగులో పడ్డారు. ఇద్దరు యువకులు వెంటనే తేరుకుని గట్టుకు చేరుకోగా చంద్రశేఖర్‌రెడ్డి మాత్రం గల్లంతయ్యాడు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి వరకు పోలీసులు, రెవన్యూ అధికారులు, రెస్కూ టీం సభ్యులు విస్తృతంగా గాలించినా ఆచూకి లభ్యం కాలేదని సీఐ వెల్లడించారు.

ఎర్రచందనం కేసులో నిందితుడి అరెస్టు



పట్టుబడ్డ మూడే నరసింహ నాయక్‌తో అటవీశాఖ అధికారులు

చాగలమర్రి: మండలంలోని డి.వనిపెంట సెక్షన్ పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో అక్రమంగా ఎర్రచందనం దుంగలను తరలిస్తూ ఓ.జి.తాండాకు చెందిన మూడే నరసింహనాయక్‌తో పాటు మరోకరిపై 2020లో కేసు నమోదైంది. అయితే ఈ కేసులో ఏ–1 ముద్దాయిని అరెస్టు చేసినట్లు మొబైల్ పార్టి తెలిపారు. ఏ–2 ముద్దాయి మూడే నరసింహ నాయక్ తప్పించుకున్నాడని, అతని కోసం పలు మార్లు గాలించిన ఆచూకీ తెలియలేదన్నారు. శుక్రవారం నంద్యాల జిల్లా డీఎఫ్ఓ వినిత్ కుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు మొబైల్ పార్టీ నిర్వహించిన దాడిలో మూడే నరసింహ నాయక్ పట్టుబడినట్లు డీఆర్ఓ నాగేంద్ర నాయక్ తెలిపారు. శనివారం అతనిని తిరుపతికి తరలించి, ప్రత్యేక కోర్టులో హాజరుపరచినట్లు వెల్లడించారు. డి.వనిపెంట సెక్షన్ అధికారి పి.పెద్దన్న, ఎఫ్‌బీఓలు శుభాష్, మదన గోపాల్, బి ఈ నగేష్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

పెద్దవంగలిలో 'పల్లెనిద్ర'

చాగలమర్రి: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో ఎస్ఐ రమణయ్య శనివారం పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పెద్దవంగలి గ్రామ సచివాలయం వద్ద గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి, గొడవలకు దూరంగా ఉండాలన్నారు. సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా తలారి మధుగోపాల్

గోస్పాడు: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా తలారి మధుగోపాల్‌ను నియమించారు. నంద్యాల జిల్లా భారతీయ జనతాపార్టీ అధ్యక్షురాలు బైరెడ్డి శబరి నియామక పత్రంను శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ప్రసాదరాజు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాధాష్టమి వేడుకలు



శ్రీకృష్ణరాధాలకు పుష్పాభిషేకం, జలాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని కెనరా బ్యాంకుపై వెలసిన జగన్నాథ మందిరంలో శనివారం రాధాష్టమి వేడుకలను ప్రభు నరసింహదాసు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథ బలభద్ర సుభద్ర ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం శ్రీకృష్ణ రాధ ఉత్సవ విగ్రహాలకు అభిషేకం, శంఖాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు.

యాళ్లూరు ఆసుపత్రిలో కవలల జననం



తల్లి, కవలపిల్లలతో వైద్యులు

గోస్పాడు: యాళ్లూరు సీహెచ్‌సీ ప్రభుత్వాసుపత్రిలో కానాల గ్రామానికి చెందిన ఉషా ఇద్దరు మగ కవల పిల్లలకు జన్మనిచ్చారు. గైనకాలజీ డాక్టర్ శివాని, చిన్నపిల్లల డాక్టర్ మాధవి, జనరల్ ఫిజీషియన్ రాజేష్ మాట్లాడుతూ యాళ్లూరులో ఆసుపత్రి ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు ఆసుపత్రిలో కవల పిల్లల ప్రసవాలు జరగలేదన్నారు. అయితే ప్రభుత్వం ఇటీవల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో సీహెచ్‌సీ ఆసుపత్రిలో ప్రసవాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగేలా చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా గత నాలుగు నెలలుగా ఆసుపత్రిలో ప్రసవాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కవల పిల్లలకు జన్మనిచ్చిన తల్లి, పిల్లలు ఆరోగ్యంగా ఉన్నారని డాక్టర్లు చెప్పారు.

వర్షం.. రైతన్నల హర్షం

- ఉయ్యాలవాడలో 65.02 మి.మీల వర్షం
- పైర్లకు ప్రాణం



ఇంజేడు సమీపంలో మిరప పంటలో నిలిచిన నీరు

ఉయ్యాలవాడ : మండలంలో శనివారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. 65.02 మి.మీ వర్షపాతం నమోదైంది. మండల కేంద్రంలోని బీసీ కాలనీలు, జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణ, బస్టాండు ఆవరణ జలమయమయ్యాయి. రూపనగుడి చెరువు అలుగు ఎక్కి పారుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మినుము, కంది, మిరప, మొక్కజొన్న, వరి, తదితర పంటలు 1248 హెక్టార్లలో రైతులు సాగు చేశారు. ఈ నెల 3వ తేదీ తరువాత మళ్లీ 20 రోజులకు వర్షం కురవడంతో పంటలకు ఊరటనిచ్చింది. అక్టోబర్ నుంచి రబీ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వారం రోజులు ముందుగా భారీ వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రుద్రవరం: మండలంలో రెండో రోజు శనివారం తెల్లవారు జాము నుంచి ఉదయం వరకు భారీగా వర్షం కురిసింది. అయితే ఉరుములు, మెరుపులతో పాటు గాలులు వీస్తూ వర్షం కురవడంతో కోత దశలో ఉన్న మొక్క జొన్న పంట వందల ఎకరాల్లో నేలవాలింది. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు.శుక్రవారం ఎలాంటి గాలి లేకుండా వర్షం దాదాపు 10 సెంమీ వరకు కురిసింది.ఆ వర్షానికి పొలాల్లో నీరు కూడా నిల్వ ఉండటంతో కంకులు తడిసి గింజలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా ఆర్.నాగులవరం మలుపు వద్ద ఉన్న పెద్ద వంక పొంగి నీరు ఉధృతంగా ఆర్అండ్‌బీ రోడ్డుపై ప్రవహించడంతో కాసేపు రాక పోకలు నిలిచిపోయాయి. అలాగే పలు గ్రామాల్లో ఇటీవల సాగు చేసిన జొన్న పంట పాలక దశలో ఉండగా ఆ పొలాల్లో వర్షపు నిల్వ ఉండటంతో మొలక పైరు కుళ్లి పోయే ప్రమాదం ఉందని రైతులు వాపోయారు.



ఆర్.నాగులవరం మలుపు వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



రెడ్డిపల్లె వద్ద నేలవాలిన మొక్క జొన్న పంట